క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చెల్లించాలి



మాక్లూర్: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు అందజేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాణిక్ బండార్‌లో ఆయన మాట్లాడారు. జరిగిన రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ వెంటనే రైల్వే శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు.

ఘనంగా ఎస్పీ బాలు జయంతి



నిజామాబాద్ సిటీ: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతి వేడుకలు నగరంలోని గాయత్రి నగర్లో స్వర సౌరభం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయని, గాయకులు అయాచితం నాగరాజ శర్మ, శేఖర్ వేముల, సముద్రాల రాములు, టెక్మలు విజయలక్ష్మీలు బాలు పాడిన పలు చిత్రాల పాటలను ఆలపించారు. అష్టావధాని డాక్టర్ గణపతి అశోక్ వర్మ, చందన్ రావులు బాల సుబ్రహ్మణ్యం కళ రంగానికి చేసిన సేవలను కొనియాడారు.

పాఠశాలకు సామగ్రి అందజేత



సిరికొండ: తాళ్లరామడుగు గ్రామ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి వివిధ రకాల సామగ్రిని రామాలయ ట్రస్ట్ చైర్మన్ బచ్చు పురుషోత్తం గుప్తా ఆదివారం అందజేశారు. బీరువా, కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు రామాలయ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాన్‌సింగ్ నాయక్, ఎంపీటీసీ గోవర్ధన్, ఆర్యవైశ్య జిల్లా మహిళ కన్వీనర్ సవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్పీని కలిసిన బీఎస్పీ నాయకులు



నిజామాబాద్‌నాగారం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందల్‌వాయి టోల్‌గేట్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షన నిలబడి పోరాటాలు చేయాలని కోరారు.

అభివృద్ధి చేస్తున్నా మరో అవకాశం ఇవ్వండి



నిజామాబాద్‌నాగారం: నగరంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో గులాబీ సైన్యం ఫుల్‌జోష్‌లో ఉన్నాయని... నగరం అంతా అభివృద్ధి చేస్తున్నానని మరో అవకాశం ఇవ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. ఆదివారం నగరంలో 10, 11 డివిజన్‌లకు సంబంధించి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించాలన్నారు. మేయర్ దండు నీతూ కిరణ్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలి

ఖలీల్‌వాడి: రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ఇప్పటి వరకు ధాన్యం డబ్బులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డాల్సి వస్తోందన్నారు. నాయకులు విఠల్ గౌడ్, రఘురాం పాల్గొన్నారు.

అప్పగించారు.. ఆరంభించలేదు!

- ప్రారంభానికి నోచుకోని బాల్కొండ కేజీబీవీ వసతి భవనం
- ఇరుకు భవనంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బాల్కొండ మండల కేంద్రంలో ప్రారంభానికి నోచుకోని కేజీబీవీ వసతి భవనం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల కోసం నిర్మించిన వసతి భవనాన్ని కాంట్రాక్టర్ సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. కానీ ప్రారంభించడం మరిచారు. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభానికి సమయం ముంచుకు వస్తున్నా ప్రారంభం కాలేదు. గత విద్యాసంవత్సరం ముగింపునకు రెండు నెలల ముందే కాంట్రాక్టర్ అధికారులకు అప్పగించారు. కానీ అధికారులు ప్రారంభానికి సన్నాహాలు చేపట్టలేదు. విద్యార్థులు చలికాలంలో వణుకుతూ గడిపారు. కాని అధికారులు అప్పట్లో అప్పగించడానికి మీనమేషాలు లెక్కించారు. దీంతో చలికాలం కూడా వెళ్లిపోయింది. ఎట్టకేలకు రెండున్నర నెలల క్రితం అప్పగించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో కలిపి 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. ముందుగా పాఠశాల భవనం మాత్రమే నిర్మించారు. తరువాత 2019లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు వసతి భవనంలో రూ.1.35 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అదే సంవత్సరం పనులకు శంకుస్థాపన చేశారు. పనులు కరోనా ప్రభావం వల్ల నత్తనడకన సాగాయి. ఎట్టకేలకు పనులను తుది దశకు తీసుకువచ్చి పూర్తి చేశారు. భవనానికి రంగులు కూడా వేయడం పూర్తి చేశారు. కాని లోపల పైపులైన్ పనులు, మైనర్ మరమ్మతులు ఉన్నాయంటూ కొన్నాళ్ల పాటు విద్యాశాఖకు అప్పగించలేదు. ప్రస్తుతం అన్నీ పూర్తి చేసి అప్పగించారు. ఉన్న భవనం ఇరుకుగా ఉండటం వల్లే మరో వసతి భవనాన్ని నిర్మించటానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తయినా వృథాగా ఉండటంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అందు బాటులోకి తేవాలని కోరుతున్నారు.

> **అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> కేజీబీవీ పాఠశాల వసతి భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లాం. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి వసతి భవనం ప్రారంభించాలని అధికారులకు లేఖలు రాశాం. త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉంది.
>
> – భవాని, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ బాల్కొండ

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



ఆర్యవైశ్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



జర్నలిస్టు కాలనీలో రోడ్లను శుభ్రపరుస్తూ..

ఆర్మూర్: పట్టణంలో ఆర్య వైశ్య సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఫంక్షన్ హాలు నిర్మించడానికి 15 వందల గజాల స్థలం కేటాయిస్తున్నట్లు పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ప్రకటించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గం ప్రతినిధులు ఆదివారం జీవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాల గురించి చర్చించారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జీవన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జీవన్ రెడ్డి వారికి 1500 గజాల స్థలం, నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

కౌన్సిలర్లకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, సుంకరి రంగన్నలను ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని జీవన్ రెడ్డి ఆకాక్షించారు.

కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛకాలనీ– సమైక్య కాలనీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పాల్గొని కాలనీలో రోడ్లను శుభ్రపరిచారు. కాలనీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

రైలు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఒడిశా రైలు ప్రమాద మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. దాసు మాట్లాడుతూ.. ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద కారణాలు తెలుసుకోవడానికి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలన్నారు. రైల్వే శాఖలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నాయకులు సూర్య శివాజీ, ప్రిన్స్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత తలారి నవీన్

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్ అన్నారు. ఆదివారం బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి ఏం చేసిందని అనడం సరికాదని, గడిచిన 9 ఏళ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని వ్యాఖ్యానించారు. మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బడు, పట్టణ అధ్యక్షులు కలీం, నాయకులు ఇనాయత్ అలీ, సాయిలు, శంకర్, హైమద్, వహీద్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన.. నేతల ముందస్తు అరెస్టులు



బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో.. అరెస్టయిన నేతలు



బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో.. బీజేపీ నాయకులు



మాక్లూర్‌లో అరెస్టయిన బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్/బాల్కొండ/ఆర్మూర్‌టౌన్ : సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా పర్యటన సందర్భంగా రోడ్డు మార్గంలో నిజామాబాద్ జిల్లా మీదుగా వెళ్తుండటంతో బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష నాయకులతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలను ముందుస్తుగా అరెస్ట్ చేశారు. స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పేదల సమస్యలను పరిష్కారం చేయాలని గానీ, ఇలా అరెస్టులు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఆయన ఖండించారు.

గంగమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఉన్న గంగమ్మ దేవి ఆలయంలో సత్యగంగా పౌర్ణమి (ఏరువాక పౌర్ణమి) పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్ర సంఘం నుంచి ఆలయం వరకు బోనాలతో వచ్చి గంగమ్మ దేవికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చెరువు కట్ట ప్రాంతం భక్త జన సంద్రంతో కిక్కిరిసిపోయింది.

రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ

రుద్రూర్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జేష్ఠ్య పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికం..



పుష్కరక్షేత్రంలో ఏరువాక సందడి

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఏరువాక పౌర్ణమి కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతు కుటుంబాలు నదీ స్నానాలకు తరలివచ్చారు. నదీ స్నానాలను ఆచరించిన తర్వాత వ్యవసాయ పనులను ప్రారంభించడం ఇక్కడి రైతుల ఆనవాయితీ. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు నదిలో తెప్పలు వదిలి సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

వేంకటేశ్వరుడికి పల్లకి సేవ



బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరుడికి సతీసమేతంగా పల్లకీ సేవ నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

వెల్మల్‌లో బడిబాట కార్యక్రమం



నందిపేట్(ఆర్మూర్): ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం నందిపేట మండలంలోని వెల్మల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. సీఎంవో శ్రీనివాస్‌రావు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మచ్చర్ల సాయమ్మ, ఉప సర్పంచ్ ముప్పెడ నారాయణ పాల్గొన్నారు.

గోదావరి మహాహారతి కరపత్రాల పంపిణీ



నవీపేట: ఈ నెల 4న ప్రారంభమైన గోదావరి మహాహారతి ఉత్సవాల కరపత్రాలను బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవిత్రమైన గోదావరి నది విశిష్టతను గ్రామస్తులకు వివరించారు. మురళీధర్‌రావ్‌ను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ ద్యాగ సరిన్, వీడీసీ ప్రతినిధులు బీమారెడ్డి, దశరథ్, సంజీవ్, పాందు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు



సిద్ధుల గుట్టపై నేలకొరిగిన చెట్టు

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై ఎంపీడీవో ఆఫీసు సమీపంలో భారీ తుమ్మచెట్టు విరిగిపడింది. దీంతో చాలాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. సర్పంచ్ తీగెల రాధామోహన్ స్థానికులతో కలిసి విరిగిపడిన చెట్టును తొలగించారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సిద్ధుల గుట్టపై ఉన్న రామాలయం ఎదుట భారీ చెట్టు నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికి ప్రమాదం జరగలేదు.

వర్షంతో ఉపశమనం

రుద్రూర్: ఎండ వేడికి తల్లడిల్లుతున్న ప్రజలకు ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. రుద్రూర్, మోస్రా, చందూర్, కోటగిరి మండలాల్లో వర్షంతో పాటు చిన్న చిన్న వడగండ్లు పడ్డాయి. ఎండ, వేడి ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఉష్ణోగ్రతలు తగ్గడంతో సంతోషం వ్యక్తం చేశారు.

కార్యవర్గాల ఎన్నిక..

విశ్వబ్రాహ్మణ సంఘం..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీరామ కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మంచిర్యాల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా వద్దోజి గంగామోహన్, కోశాధికారులుగా సుంకం రవి కుమార్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నారాయణ శ్యాం, వద్దోజి నారాయణ, సభ్యులుగా నర్సయ్య, భరత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ సభ్యులు ఘనంగా సన్మానించారు.

కమ్మ సంఘం..



నందిపేట్(ఆర్మూర్): ఆంధ్రనగర్ గ్రామంలో ఆదివారం కమ్మ సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యలమర్తి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గిజుపల్లి ధనశ్రీనివాస్ రావు, కోశాధికారిగా చల్లా వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా కోయలమూడి శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా కుర్రా రవి కుమార్, డైరెక్టర్లుగా గుత్తా సాంబశివరావు, కొరటాల శ్రీనివాసరావు, నాయుడు శ్రీధర్, గోవాడ రత్తయ్య, కాపు రమేష్, ఎక్స్ అఫిషియో డైరెక్టర్లుగా యాళ్ల రాము, యనమదల రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	ఫాస్ట్ ఎక్స్-3డీ (తెలుగు) 1.00 చక్రవ్యూహం - 4.00 అహింస - 6.30 బిచ్చగాడు 2 - 9.55
స్క్రీన్-2 –	బిచ్చగాడు(2) - 12.20 మేమ్‌ఫేమస్-3.35, పరేషాన్- 6.45 2018 - 9.40
స్క్రీన్-3 –	అహింస- 12.35 ; 2018 - 4.00 నేను స్టూడెంట్ సర్ - 7.10, 10.00
స్క్రీన్-4 –	మేమ్‌ఫేమస్ - 12.25 స్పైడర్‌మాన్ అక్రాస్ (తె) - 3.35, 9.45 ; (ఇంగ్లిష్) - 6.40

గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

వేల్పూర్: పచ్చలనడ్కుడ ప్రైమరీస్కూలుకు చెందిన ప్రణీత, లౌక్య, గమణ, వర్షిణి, శరణ్య, విజ్ఞాన్ అనే విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం అంకం నరేశ్ ఆదివారం వెల్లడించారు. వీరంతా ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఎంపికైనట్లు చెప్పారు. వీరిని స్థానిక సర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయులు లింబగిరిస్వామి, రాజేశ్వరి, కృష్ణవేణి, అనూష అభినందించారు.



ఎంపికైన పచ్చలనడ్కుడ స్కూలు విద్యార్థులు

సీఎం కేసీఆర్‌కు జిల్లాలో ఘన స్వాగతం



బాల్కొండ: నిర్మల్ జిల్లా కేంద్రంలో సమీకృత కార్యాలయ ప్రారంభానికి ఆదివారం రోడ్డు మార్గంలో వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో జాతీయ రహదారి–44 పై బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూలు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం

– కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి



మాట్లాడుతున్న ముప్ప గంగారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందని, బీఆర్ఎస్‌ను గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి విమర్శించారు. ఆదివారం ముదక్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు 2 నెలలైనా ధాన్యం డబ్బులు రాక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు దశాబ్ది ఉత్సవాలు, రైతు దినోత్సవాలకు రూ.105 కోట్లు కేటాయించి సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులు నెలల తరబడి కల్లాల వద్దే పడుకుంటున్నారని, ఇంకా ధాన్యం సేకరణ పూర్తి కాలేదన్నారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు ఇంకా పరిహారం అందలేదన్నారు. మంచిప్ప రిజర్వాయర్ పనులు 90శాతం పూర్తయ్యాయని స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రకటించారని, ఎక్కడ పూర్తయ్యాయో చూపించాలని ఆయన సవాల్ విసిరారు. దీనిపై చర్చించేందుకు ఎక్కడైనా సిద్ధమన్నారు.